అగ్రనేతల సభలు.. సమావేశాలు

నేడు తాజ్‌కృష్ణలో కాంగ్రెస్ సిడబ్ల్యూసి మీటింగ్

రేపు తుక్కుగూడలో భారీ బహిరంగ సభ

ఇవాళ నగరానికి రానున్న అమిత్‌షా

రేపు పరేడ్‌గ్రౌండ్‌లో

జరిగే విమోచన దినోత్సవానికి హాజరు



హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త: ఎన్నికల గడువు దగ్గరపడుతున్నా కొద్ది రాజకీయం రంజుగా మారుతుంది. ప్రధాన పార్టీలన్నీ తమ ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాయి. ప్రజల మద్దతు కూడగట్టేందుకు హైదరాబాద్ వేదికగా బహిరంగ సభలు, సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ రెండురోజులపాటు సిడబ్ల్యూ సమావేశాలు, తుక్కుగూడ వేదికగా కాంగ్రస్ విజయభేరి సభ నిర్వహిస్తుంటే.. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ వేదికగా బిజెపి బలప్రదర్శనకు సిద్దమవుతుంది. ఇటు బిఆర్ఎస్ పార్టీకూడా శనివారం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేసుకుంది. అలాగే ఎంఐఎం సైతం రేపు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. జాతీయ సమైక్యతా దినోత్సవం పేరుతో నాంపల్లిలోని దర్గా యాసఫియన్ నుంచి బైక్‌ర్యాలీ చేపట్టి మాసబ్‌ట్యాంక్‌లోని హాకీ స్టేడియంలో భారీ బహిరంగసభను నిర్వహించాలని నిర్ణయించింది. కేవలం 24గంటల వ్యవధిలోనే నాలుగు పార్టీలు, నాలుగు ప్రాంతాల్లోన్న భారీ బహిరంగసభలు నిర్వహిస్తుండటంతో జనసమీకరణ నేతలకు సమస్యగా మారింది.

నేడు తాజ్‌కృష్ణలో కాంగ్రెస్ సిడబ్ల్యూసీ సమావేశాలు.. నగరంలో సిడబ్ల్యూసి సమావేశాలకు టిపిసిసి సర్వం సిద్దం చేసింది. బంజారాహిల్స్‌లోని హోటల్‌తాజ్‌కృష్ణలో నేటినుంచి రెండురోజులపాటు సమావేశాలు జరగనున్నాయి. శనివారం మధ్యాహ్నం 12గంటల సమయంలో రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీలు హైదరాబాద్ చేరుకోనున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా తాజ్‌కృష్ణ హోటల్‌లో జరిగే సిడబ్ల్యూసి సమావేశాల్లో పాల్గొననున్నారు. రాత్రి అక్కడే బసచేసి అనంతరం రేపు తుక్కుగూడలో జరిగేసభలో పాల్గొననున్నారు. ఈసభకు కాంగ్రేస్ అగ్రనేతలు సోనియా,రాహుల్‌గాంధీ,ఖర్గే సహా పార్టీ ప్రముఖులంతా హాజరుకానున్నారు. ఇదే వేదిక నుంచి ఎన్నికల శంఖారావం పూరించనున్నారు.

రేపు పరేడ్‌గ్రౌండ్‌లో అమిత్‌షా.. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని రేపు పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించే కార్యక్రమానికి కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షా హాజరుకానున్నారు. రక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈకార్యక్రమానికి అమిత్‌షా ముఖ్యఅతిధిగా హాజరై జాతీయ పతాకావిష్కరణ చేయనున్నారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ నేపథ్యంలో జనసమీకరణ కూడా భారీఎత్తున నిర్వహించాలని పార్టీ శ్రేణులకు ఆదేశాలు వెళ్లాయి. ముఖ్యంగా నగరంలో సికింద్రాబాద్, కంటోన్మెంట్, ఉప్పల్, కుత్బుల్లాపూర్, ముషీరాబాద్, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, సనత్‌నగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ప్రాంతాల నుంచి దాదాపు 50వేలమందిని తరలించేందుకు బిజెపి నేతలు సిద్దమవుతున్నారు.

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్ విమోచన అమృత మహోత్సవం సందర్భంగా పోలీసుల లీహార్సల్స్, లంబాడీల సాంస్కృతిక విన్యాసాలు

బైక్ ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి

తెలంగాణ విమోచన ఉత్సవాల్లో భాగంగా సికింద్రాబాద్ వైఎంసీఏ వద్ద నిర్వహించిన బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

కంటోన్మెంట్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: తెలంగాణ విమోచన ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం సికింద్రాబాద్ వైఎంసీఏ అమర వీరుల స్థూపం నుంచి పరకాల అమరదామం వరకు సాగే బైక్ ర్యాలీని కేంద్ర పర్యా టక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ బైక్ ర్యాలీ హబ్సిగూడ, భువనగిరి, జనగామ, వరంగల్, ములుగు, పరకాల అమరదామం లోని అమర వీరుల స్థూపం వరకు కొనసాగుతుందని బిజెపి శ్రేణులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్య క్షులు శ్యామ్ సుందర్‌గౌడ్, మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక, బిజెపి శ్రేణులు చింతల రామ్ చంద్రారెడ్డి, శారద మల్లేశ్, విజయరామరాజు పాల్గొన్నారు.

ప్రజలు ఐకమత్యంతో ఉత్సవాలు జరుపుకుంటున్నారు : డిసిపి సాయి చైతన్య

చార్మినార్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త : ప్రజలు ఎంతో ఐకమత్యంతో ఉత్సవాలను జరుపుకుంటున్నారని దక్షిణ మండలం డిసిపి పి.సాయి చైతన్య అన్నారు.ఘాన్సీ బజార్ ఝాలాలోని శ్రీ రాణి సతీ దాదీజీ మందిరంలో జరిగిన భవ్య మేళాలో పాల్గొన్న డిసిపి సాయి చైతన్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.మందిరం కమిటి ప్రతినిధులు డిసిపి సాయి చైతన్యను శాలువ కప్పి సన్మానించారు.ఈ కార్యక్రమంలో హుస్సేనీఆలం సిఐ నాగేశ్వర్‌రెడ్డి, మందిరం కమిటి అధ్యక్షులు మధుసూధన్ సొంతలియా, కాచిగూడ శ్యామందిరం ప్రధాన కార్యదర్శి ఇంద్రకుమార్ అగర్వాల్, ఉపాధ్యక్షులు రాందేవ్ అగర్వాల్,రాజేంద్ర కుమార్,శశికాంత్ అగర్వాల్,కపూర్ చంద్ గుప్తా,పవన్ అగర్వాల్,గిరిధర్ లాల్ అగర్వాల్,ఆర్యా అగర్వాల్,శంకర్ అగర్వాల్,అశోక్ సేన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

డయాబెటిక్ పుట్‌కేర్‌ల పంపిణీ

డయాబెటిక్ పుట్‌కేర్‌లను అందచేస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్,ఆసుపత్రి వైద్యులు

అష్టల్‌గంజ్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: పాదాల పూతల అధిక ప్రమాదంతో భాదపడుతున్న రోగులకు డయాబెటిక్ పుట్‌కేర్ క్లినిక్ ద్వారా,ఉస్మానియా ఆసుపత్రి,లెప్రా సోసైటి సహకారంతో ప్రత్యేకమైన పుట్‌వేర్‌లను అందచేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేంద్ తెలిపారు.శ క్రవారం ఆసుపత్రిలో హెల్పింగ్ హ్యాండ్ ఫ్రాం డేషన్ నుండి ఉచిత విరాళంతో పేద రోగులకు ప్రత్యేకమైన పాదరక్షలను పంపణి చేయడం జరిగింది.ఈకార్యక్రమంలో ఆసుపత్రి అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ త్రివేణి, ప్రోఫెసర్లు రాకేష్‌సహాయ్, నీలవేణి, పస్ట్‌ఆర్.ఎం.ఓ డాక్టర్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ మాసం ఉత్సవాలు

యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త : అంగన్ వాడీ కేంద్రాలలో పోషణ మాసం ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందని టిడిపివో కృష్ణవేణి తెలిపారు. శుక్రవారం బోరబండ సాయిబాబా నగర్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారుల తల్లులను పిలిపించి వారికి పలు అంశాలపై సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. ముఖ్యంగా బాలింతలు ఆకుకూరలు పండ్లు తీసుకోవాలని ప్రతి మనిషికి కనీసం 2వందల గ్రాముల ఐరన్ అవసరం ఉంటుందని తెలిపారు. బాలింతలు, గర్భి నీలు 6సంవత్సరాలలోపు పిల్లల, తల్లులకు అంగన్‌వాడీ సెంటర్‌లో ప్రభుత్వం నుంచి అన్ని రకాల పోషణ గల ఆహార పదార్థాలను అందివ్వడం జరుగుతుందని తెలిపారు. ఎఎన్ యమ్ వసంత, సురేఖ, ప్రమీల, సునీత, పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూం ఎంపికలో దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు

మంత్రులు,ఎమ్మెల్యేల సమక్షంలో ఆన్‌లైన్ డ్రాతో లబ్దిదారుల ఎంపిక

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని, సబితాఇంద్రారెడ్డి, మహమూద్‌అలీ తదితరులు

హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త: పేదప్రజలు ఆత్మగౌరవంతో జీవించాలనే ఉద్దేశ్యంతో వారికి డబుల్‌బెడ్‌రూం ఇండ్లను ప్రభుత్వం నిర్మించి ఉచితంగా అందజేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. హైదరాబాద్ కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో రెండోవిడతలో భాగంగా ర్యాండమైజేషన్ సాఫ్ట్‌వేర్ విధానం ధ్వారా ఆన్‌లైన్ డ్రా నిర్వహించి లబ్దిదారులను ఎంపిక చేశారు. ఆన్‌లైన్ లాటరీ ద్వారా డబుల్‌బెడ్‌రూం ఇండల్లను లబ్దిదారులకు కేటాయించారు. రెండోవిడదత ప్రక్రియలో దివ్యాంగులు, ఎస్సీ,ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించామన్నారు. దివ్యాంగులకు 470, ఎస్సీలకు 1,923, ఎస్టీలకు 655 కేటాయించగా ఇతరులకు 8,652 కేటాయించినట్లు వివరించారు. ఈకార్యక్రమంలో మంత్రులు మహమూద్‌అలీ, సబితా ఇంద్రారెడ్డి, నగర మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు, మాగంటి గోపినాథ్, కాలేరు వెంకటేష్, అరికెపూడి గాంధీ, దానం నాగేందర్, ముఠా గోపాల్, ప్రకాశ్‌గౌడ్‌లతో పాటు ఎమ్మెల్సీలు ప్రభాకర్, వాణిదేవి, మీర్జా రహమత్‌బేగ్, జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ ,హైదరాబాద్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్, మేడ్చల్ అమోయ్‌కుమార్ సమక్షంలో కార్యక్రమం సాగింది. ఈసందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి పరిధిలో 24నియోజకవర్గాల్లో రెండోవిడతగా 11,700మంది లబ్దిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. కేటాయింపుల్లో ఎవరి జోక్యంలేకుండా పారదర్శకంగా లబ్దిదారులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. పేద,మధ్యతరగతి ప్రజలు గొప్పగా బతకాలనే ఉద్దేశ్యంతో డిమాండ్ ఉన్న ఏరియాల్లో ఇల్లు కట్టించి ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ మధుసూధన్, డిఆర్ఓ వెంకటాచారి, ఆర్డీవోలు సూర్యప్రకాశ్,రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా బిల్లులో బీసీలకు సబ్‌కోటా కల్పించాలి

రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

ధర్నా నుద్దేసించి ప్రసంగిస్తున్న ఆర్.కృష్ణయ్య

ధర్నాచౌక్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త: మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోట కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహిళా బిల్లు దొరల భార్యలకు వద్దు ఎస్సీ ఎస్టీ బీసీ మహిళలకు కావాలని డిమాండ్ చేస్తూ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు ముఖ్యఅతిధిగా హాజరై ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ మహిళలకు రాజకీయంగా అతితక్కువ ప్రాతినిధ్యం ఉంది కాబట్టి మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్లు పెట్టాలని, అందులో బీసీ మహిళలకు సబ్‌కోటా ఇవ్వాలనే ఆలోచన రావటం లేదంటే బీసీల పట్ల రాజకీయ పార్టీలకు ఉన్న చులకన భావం స్పష్టం అవుతోందని అన్నారు. ప్రజాస్వామిక దేశంలో అన్ని కులాలకు, సామాజిక వర్గాలకు వారి జనాభా ప్రకారం వాటా ఇవ్వాలని, 75 సంవత్సరాల తరువాత కూడా బీసీల వాటా బీసీలకు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. బీసీలకు ఇచ్చేది భిక్షం కాదని, ఇది రాజ్యాంగ బద్ధమైన ప్రజాస్వామ్యహక్కని అన్నారు. త్వరలో జరగబోయే జనాభా గణనలో కులాల వారీగా బీసీ జనాభా గణన చేయాలని కోరారు. బీసీలకు అన్ని రంగాలలో అన్యాయం జరుగుతోందని, ఇప్పటికైనా బీసీల వాటా బీసీలకు ఇవ్వకపోతే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీల బీసీ మహిళలు తమ వైఖరి, విధానపరమైన నిర్ణయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ నేతృత్వంలో జరిగిన ఈ దీక్షలో జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, నీల వెంకటేష్, అంజి, ఇందిరాశోభన్, భాగ్యలక్ష్మి, నర్సింహాగౌడ్, పి.సుధాకర్, అనంతయ్యన, దీపిక, వసం దుష్యంత పాల్గొన్నారు.

అంబర్‌పేటలో బిజెపి జెండా ఎగరటం ఖాయం

బిజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్.గౌతంరావు

మహిళలను బీజేపీలోకి ఆహ్వానిస్తున్న డాక్టర్ ఎన్. గౌతంరావు

ధర్నాచౌక్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త: అంబర్‌పేటలో ఈసారి బీజేపీ జెండా ఎగరటం ఖాయమని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్.గౌతం రావు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం అంబర్‌పేటలో కొందరు మహిళా నేతలు బీజేపీలో చేరారు. మహిళలకు బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో అంబర్‌పేటలో అభివృద్ధి కుంటుపడిందని, చిన్నపాటి వర్షాలకే రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని ఆరోపించారు. నాలుగేళ్ల నుండి నియోజక వర్గంలో అభివృద్ధి పనులకు మోక్షం లేదని, ఎన్నికలు సమీపిస్తుండటంతో శంఖుస్థాపనలు పేరుతో హడావిడి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శ్యాంరాజ్, నాయకులు నాగభూషన్‌చారి, మహిలా మోర్చా నాయకురాలు జ్యోతి, శిరీష, ఆర్తీ, రత్నప్రభ, తిరుపతి, లాస్య, రేఖ, వసంత తదితరులు పాల్గొన్నారు.

మండప నిర్వాహకులందరూ నిబంధనలు పాటించాలి

నార్సింగి ఎసిపి లక్ష్మీ నారాయణ

నార్సింగి పోలీసు స్టేషన్‌లో గణేష్ మండప నిర్వాహకులకు సూచనలు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ శివకుమార్

నార్సింగి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : వినాయక మండప నిర్వాహకులంతా స్వచ్ఛందంగా నిబంధనలు పాటిస్తూ, ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవాలని నార్సింగి ఏసీపీ లక్ష్మీ నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం నార్సింగి పోలీసు స్టేషన్ ఆవరణలో వినాయక మండప నిర్వాహకులతో ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌తో కలిసి ఏసీపీ ప్రత్యేక అవగాహన సమావేశంను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపతి మండప నిర్వాహకులంతా భక్తికి ప్రాధాన్యతనివ్వాలని, మండపాల వద్ద భక్తి, భజన పాటలను పెట్టుకోవాలని సూచించారు. కరెంటు కనెక్షన్ల కోసం సంబంధిత శాఖ అధికారుల నుంచి తప్పకుండా అనుమతి పొందాలని తెలిపారు. వినాయక నవరాత్రులు ముగిసేంత వరకు 24.గంటలు ఇద్దరు తప్పకుండా ఉండాలని, ఒక డ్రమ్ము నీటిని అందుబాటులో ఉంచుకోవాలని, రసాయనాలతో కాకుండా మట్టితో తయారు చేసిన విగ్రహాలను పెట్టుకొని పూజించుకోవడం మంచిదని సూచించారు. గత ఏడాది వరకు ఎన్ని మండపాలు ఉన్నాయో వాటికి మాత్రమే పోలీసు శాఖ నుంచి అనుమతులు ఇస్తామని, కొత్త కాలనీల్లో ఏర్పాటు చేయాలనుకుంటే ముందుగానే అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సబ్ ఇన్‌స్పెక్టర్లు, మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సంజీవరెడ్డి నగర్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త : ఎర్రగడ్డలోని మెట్రో స్టేషన్ వద్ద చిత్తు కాగితాలు ఏరుకుంటూ, భిక్షాటన చేస్తు జీవిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శుక్రవారం సనత్‌నగర్ ఇన్స్‌పెక్టర్ బాల్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం 50ఏళ్ళ వయసు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి ఎర్రగడ్డ మెట్రో స్టేషన్ దగ్గర భిక్షాటన చేస్తూ, చిత్తుకాగితాలు ఏరుకుంటూ జీవనం సాగించే వ్యక్తి అపస్మారక స్థితిలో నేలపై పడి ఉంటనాన్ని గమనించిన స్థానికులు ఈ నెల 13వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. వెంటనే పోలీసుల సంఘటన స్థలానికి చేరుకుని గమనించగా అనారోగ్య కారణాల వల్ల లేదా సరైన ఆహారం లేకపోవడం వల్లనో చని పోయి ఉంటారని తెలిపారు. సనత్‌నగర్ ఫోన్ నెంబర్ 9490617132, ఎస్ఐపి నంబర్ 8712663231

పిఎన్‌బి బ్యాడ్మింటన్ ట్రోఫీ ఆవిష్కరణ

ట్రోఫీ ఆవిష్కరిస్తున్న బాడ్మింటన్ స్టార్లు సాత్విక్ సాయిరాజ్, చిరాశెట్టి

హైదరాబాద్, సెప్టెంబర్ 15,ప్రభాతవార్త: పిఎన్‌బి మెటిలైఫ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ ఏడోసీజన్ పోటీలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం సోమాజిగూడలో జరిగిన కార్యక్రమంలో పోటీల ట్రోఫీని బ్యాడ్మింటన్ డబుల్స్ వరల్డ్ నెంబర్ 2 జోడీ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్‌శెట్టి ఆవిష్కరించారు. ఇక నుంచి ఈరువురు పిఎన్‌బి మెంటార్లుగా వ్యవహరించన్నారు. ఈసందర్భంగా సాత్విక్ మాట్లాడుతూ వర్థమాన క్రీడాకారులు ఇలాంటి పోటీల నుంచే వెలుగులోకి వస్తారని అన్నారు. కేరీర్ ప్రారంభ దశలో అనేక ఒడిదుడుగులు ఉంటాయని, వాటిని తట్టుకుని నిలబడాలంటే క్రమశిక్షణ, కఠోర సాధన అలవర్చుకోవాలని సూచించారు. ఇక గుహాటిలో శుక్రవారం ప్రారంభమైన ఈపోటీలు హైదరాబాద్‌తో సహదేశంలోని పదినగరాల్లో దశలవారిగా నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్‌లో వచ్చేనెల 19నుంచి 25వరకు పోటీలు జరగనున్నాయని పేర్కొన్నారు.

చంద్రబాబునాయుడు అరెస్ట్‌కు నిరసనగా ధర్నా

గండిమైసమ్మచౌరస్తాలో ధర్నా చేస్తున్న చంద్రబాబునాయుడు అభిమానులు

దుండిగల్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్ట్‌ను ఖండిస్తూ ఆయన అభిమానులు దుండిగల్ మున్సిపాలిటీ గండిమైసమ్మ చౌరాస్తాలో ధర్నా చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన మహానేత చంద్రబాబునాయుడిని అక్రమంగా అరెస్ట్ చేయడం హేయమైన చర్య అన్నారు. వైకాపా అవినీతిని ప్రశ్నిస్తే అక్రమ అరెస్ట్‌లకు పాల్పడుతున్నారన్నారు. విజన్ ఉన్న నాయకుడు, తెలుగు వారి ఆత్మగౌరవం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వ్యక్తి గురించి అవినీతి అక్రమాలతో జైలుపాలైన వైకాపా నాయకులు మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. వైకాపా అక్రమాలను ప్రజల్లో ఎండగడుతుంటే సమాధానం చెప్పే తెలివిలేక చంద్రబాబునాయుడిని అడ్డదారిలో అరెస్ట్ చేశారన్నారు. రాజకీయ కక్షలతో ప్రజాస్వామాన్ని వైకాపా కూనీ చేస్తోందని తెలిపారు. వైకాపా దౌర్జన్యాలను యావత్ తెలుగు ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్ని కేసులు పెట్టినా ఆయన ధైర్యాన్ని దెబ్బతీయలేరని, నిజాయితీగా బయటికి వస్తారన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని పాతరపెడుతున్న వైకాపాకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో చంద్రబాబు అభిమానులు పాల్గొన్నారు.

భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలి

ఎఐసిసి పర్యవేక్షకులు ఎమ్మెల్యే రూబి మనోహరన్

సెయింట్ థెరిస్సా హాస్పిటల్ సిబ్బందితో కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు

సంజీవరెడ్డి నగర్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, భవిష్యత్తు నిర్మాణం కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని సనత్‌నగర్ నియోజకవర్గం ఏఐసీసీ పర్యవేక్షకులు, తమిళనాడు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే రూబీ మనోహరన్ అన్నారు. సనత్‌నగర్ డివిజన్‌లోని సెయింట్ థెరిస్సా హాస్పిటల్‌లో శుక్రవారం ఉద్యోగులు, వైద్య సిబ్బంది, నర్సులతో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రూబీ మనోహరన్ హాజరై మాట్లాడారు. 17వ తేదీన తుక్కుగూడలో నిర్వహించే విజయభేరి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో కెసిఆర్ ప్రభుత్వం నియంతృత్వ పాలన సాగిస్తున్నాయని ఆరోపించారు. డాక్టర్ కోట నీలిమ మాట్లాడుతూ మహిళలు, బహుజన వర్గాల సమస్యలను కాంగ్రెస్ పార్టీ మాత్రమే అర్థం చేసుకుంటుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఇవాన్ వాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో థామస్ అమ్మ, అబ్బాస్ షరీఫ్, ఇబ్రహీం పటేల్ తదితరులు పాల్గొన్నారు.

జాతి సమైక్యతకు ప్రతీక హిందీ

అవంతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలో ఘనంగా హింది భాషా దినోత్సవ వేడుకలు

హిందీ భాషా దినోత్సవ వేడుకల్లో నృత్యప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

హైదరాబాద్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : జాతి సమైక్యతకు ప్రతిక హింది బాష అని పలువురు వక్తలు పేర్కొ న్నారు. హిందీ భాషా దినోత్స వం సందర్భంగా బర్కత్‌పురలోని అవంతి డిగ్రీ అండ్ పీజీ కళాలో హిందీ దివస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ భారతదేశం విభిన్న భాషల సమాహారమన్నారు. జాతి మొత్తం సులువుగా అర్థం చేసుకునే భాష హింది అన్నారు. భారత రాజ్యాంగంలో హిందీనీ జాతీయ భాషగా పొందుపరుచాలని కోరారు. ప్రజల మధ్య సద్భావన, సంస్కృతి కాపాడటలో హిందీకి అధికార భాష హోదాను ఇచ్చారని పేర్కొన్నారు. హింది నేర్చుకుంటే జాతీయ స్థానంలో వివిధ పోటీ పరీక్షలో రాణించవచ్చన్నారు. విద్యార్థులు అన్ని భాషలు నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిద సాంస్కృతిక కార్యక్రమాలను, ఉపన్యాన, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాయిరాం తధితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై బండ్లగూడ మేయర్ సమీక్ష

బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ కార్యాలయంలో అభివృద్ధి పనుపలపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

నార్సింగి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులను దూరం చేసేందుకు చేపట్టిన భూగర్భ డ్రైనేజీ, వీధి దీపాలు, సీసీ రోడ్లు, బిటి రోడ్ల పనులు, పార్కులు, ఓపెన్ జిమ్ పనులు ఎంత వరకు పూర్తయ్యాయి? ఎప్పటి వరకు పూర్తి అవుతాయి? అంటూ ఆరా తీశారు. చేపట్టిన పపనులన్నింటిని నాణ్యతతో, పది కాలాల పాటు ప్రజలకు ఉపయోగపడేలా చేయాలని, నాణ్యతా ప్రమాణాల్లో తేడా వస్తే సంబంధిత కాంట్రాక్టర్‌పై వేటే వేస్తామని, బిల్లులు ఆపివేస్తామని మేయర్ హెచ్చరించారు. నిబందనలు పాటిస్తూ చేయాలని, ఇష్టానుసారంగా పనులు జరిగితే సంబంధిత శాఖకు సంబంధించిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని పై అధికారులకు ఫిర్యాదు చేస్తామని మహేందర్‌గౌడ్ చురకలు అంటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శరత్‌చంద్ర, మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, డీఈ యాదయ్య, ఏఈ రాజ్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలి : కొంతం దీపిక

అడ్డగుట్ట,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అందువల్ల మట్టి గణపతులతోనే పూజించాలని మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక తెలిపారు. జిహెచ్ఎంసి తయారు చేసి మట్టి గణపతులను శుక్రవారం రెజిమెంటల్ బజార్‌లోని మోండా డివిజన్ వార్డు కార్యాలయం వద్ద మట్టి గణపతులను ఆమె చేతుల మీదుగా ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారి గాయత్రి దేవీ, ఎస్.ఎఫ

హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

మెహిదీపట్నం, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త : హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారినికి కృషి చేస్తానని లంగర్‌హౌస్ డివిజన్ కార్పొరేటర్ ప్రతినిధి వజీ ఉజ్జమా సద్దిఖి తెలిపారు. లంగర్‌హౌస్ డివిజన్ బాపూనగర్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వజీ ఉజ్జమా సద్దిఖి మాట్లాడుతూ.. నిరుపేదలైన విద్యార్థులతో పాటు అనాథ విద్యార్థులకు సైతం వసతి గృహాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వసతి గృహాలు పేద విద్యార్థుల భవిష్యత్తుని తీర్చిదిద్దుతాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ ఆదేశాల మేరకు వసతి గృహాన్ని సందర్శించి పరిశీలించడంతో పాటు విద్యార్థులతో మాట్లాడడం జరిగిందని తెలిపారు. హాస్టల్‌కు డాక్టర్ సదుపాయం లేక పోవడంతో సంధింత అధికారులతో మాట్లాడి డాక్టర్‌ను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకులు మాతంగి రమేష్, హాస్టల్ వార్డెన్ చంద్రశేఖర్, కార్యకర్తలు, విద్యార్థులు ఉన్నారు.

చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా నిరసన

ఒ.యూ ఆర్ట్స్ కాలేజ్ ముందు నల్లబ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేస్తున్న తలారి శ్రీనివాస్

తార్నాక, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: ఏ.పీ మాజీ సీఎం చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా ఉస్మానియా యూనివర్సిటీలో చంద్రబాబునాయుడు అభిమాన సంఘం జాతీయ అధ్యక్షుడు, ఓ.యూ పరిశోధక విద్యార్థి, జర్నలిస్టు తలారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నల్లబ్యాజ్జీలతో నిరసన తెలిపారు. చంద్రబాబు అరెస్టు అప్రజాస్వామిక అరెస్టును చూడలేమంటూ కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. చంద్రబాబు నాయుడును వెంటనే విడుదల చేయాలని తలారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబునాయుడు ఫ్యాన్స్ గోపి, నరేందర్, మల్లేష్, కృష్ణం రాజు, దిలిప్, వెంకటేష్, ప్రదీప్, మహేష్, అజయ్, శ్రీనాధ్, నరేస్ తధితరులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి
డీసీపీ కిరణ్ కారె

డీసీపీ కిరణ్‌కారెను సన్మానిస్తున్న అభిషేక్‌రాజ్

మెహిదీపట్నం, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త : పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్‌కారె కోరారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ పండుగల సందర్భంగా శుక్రవారం సౌత్‌వెస్ట్ జోన్ పరిధిలోని వివిధ శాఖల అధికారులు, పీస్ కమిటీ సభ్యులు, గణేష్ మండపాల నిర్వాహకులతో ఆసీఫ్‌నగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్‌కారె మాటాడుతూ.. పండుగలను ప్రతి ఒక్కరు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. ఇతరులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండప నిర్వాహకులు ముందుగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండపాల ఏర్పాటు స్థలంతో పాటు నిర్వాహకులు వివరాలను తెలపాలని, అదే విధంగా మండపం వద్ద విద్యుత్, ట్రాఫిక్, డ్రేనేజీ, రోడ్ల సమస్యలు లేకుండా ముందుగానే చూసుకోవాలన్నారు. తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయనను సన్మానించిన వారిలో నాంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు గోప అభిషేక్‌రాజ్, రాచకొండ శ్రీకాత్‌సాగర్, ప్రభుపూజారి స్థానికులు ఉన్నారు.

ప్రతి ఒక్కరు సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

చిక్కడపల్లి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరు సేవాగుణాన్ని అలవర్చుకోవాలని చిక్కడపల్లి పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేశ్, బిజెపి సీనియర్ నేత చెర్ల గోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సింగారపు రమేశ్ గుప్త ఆధ్వర్యంలో స్థానిక వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. కార్యక్రమంలో అన్నదాతలు ప్రొద్దుటూరి నరసింహారావు, వెంకటసుబ్బయ్య, సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సింగారపు రమేశ్, చేపూరి లక్ష్మణ్, ఏ.బాలకుమార్, శుభమస్తు శ్రీనివాస్, బాలచందర్, ప్రాజెక్టు చైర్మన్ టి.రవీందర్‌గుప్త, పల్లెర్ల రమేశ్, సురేందర్‌గుప్త, భిక్షపతి, సింగారపు శంకర్, మామిళ్ళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అన్ని దానాలలోకంటే అన్నదానం గొప్పదని, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంఘం సభ్యులు చురుగ్గా పాల్గొనాలన్నారు.

బైక్ ర్యాలీలో పాల్గొన్న బిజెపి నాయకురాలు



బైక్ ర్యాలీలో పాల్గొన్న కీర్తిరెడ్డి జూటూరు

ఫిల్మ్‌నగర్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త : హైదరాబాద్ విమోచన దినోత్సవ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు అజాద్ కా అమృత్ మహోత్సవ కార్యక్రమం శుక్రవారం సికింద్రాబాద్ పరెడ్ గ్రౌండ్ నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమైంది. ఈ బైక్ ర్యాలీలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి బైక్ ర్యాలీలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా భాజపా ఉపాధ్యక్షురాలు, జూబ్లీహిల్స్ నియోజకవర్గం నాయకురాలు కీర్తిరెడ్డి జూటూరు స్వయంగా బైక్ నడపటం పలువురిని విశేషంగా ఆకర్షించింది.

త్యాగరాయ గానసభలో ప్రకృతి పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త: మరుగునపడి జానపద, గ్రామీణ కళలను వెలికి తెచ్చి కళాకారులను ఆదుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రముఖులు పేర్కొన్నారు. శుక్రవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో మీతోమేము స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లు, జోగినీలు, కళాకారులు, గాయనీ గాయకులకు ప్రకృతి పురస్కారాలు ప్రదానోత్సవ సభ నిర్వాహకులు పల్లె ప్రవీణ్‌రావు ఆధ్వర్యంలో జరిగింది.

స్వామి వారిని వేడుకుంటే కోర్కెలు నెరవేరుతాయి : శ్రీగణేష్

5వ వార్డు గాంధీ నగర్‌లో అన్నదానం చేస్తున్న ఎస్.జి.ఎఫ్ అధినేత శ్రీగణేష్,చైర్మన్ గజ్జెల నాగేశ్ తదితరులు

కంటోన్మెంట్,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: శ్రీ సద్గురు జగలింగేశ్వర ప్రసన్న స్వామి వారిని వేడుకుంటే కోరుకున్న కోరె ్కలు నేరవేరుతాయని ఎస్.జి.ఎఫ్ అధినేత శ్రీగణేష్, బేవరేజెస్ కార్పోరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్‌లు తెలిపారు. అమావాస్య ను పురస్కరించుకొని శుక్రవారం కంటోన్మెంట్ 5వ వార్డు గాంధీ నగర్‌లోని శ్రీ సద్గురు జగలింగేశ్వర ప్రసన్న స్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలన్నారు. ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో జీవించాలని స్వామి వారిని వేడుకున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను ఆలయ నిర్వాహకులు పెద్ద మల్లప్ప, లింగప్పలు శాలువకప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శేఖర్, భవంతూ, నరేశ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయ భేరి సభను విజయవంతం చేయాలి
ఆదం సంతోష్

కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్నటిపిసీసీ ప్రధాన కార్యదర్శి ఆదం సంతోష్ తదితరులు

అడ్డగుట్ట,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: ఈ నెల 17వ తేదీన తుక్కుగూడలో జరగనున్న కాంగ్రెస్ విజయభేరి సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఏఐసీసీ పరిశీలకులు ఆర్. మనోహరన్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్‌లు పిలుపునిచ్చారు. టీపిసీసీ ప్రధాన కార్యదర్శి ఆదం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు. వ్యక్తిగత విబేదాలు, గ్రూపు రాజకీయాలు పక్కన పెట్టి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ ఆదం ఉమా దేవి, ఎన్.ఎస్.యు.ఐ. నేత ఆదం సృజన్, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినిలు అప్రమత్తంగా ఉండాలి : షీటీమ్

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీమ్ సభ్యులు

జీడిమెట్ల, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : సుభాష్‌నగర్ డివిజన్ పరిధి అపురూప కాలనీలోని టివిఆర్ మోడల్ హైస్కూల్లో షీటీమ్ సభ్యులు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పరిచయం లేని వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫోన్ తక్కువగా వినియోగించాలని, టెక్నాలజీ అనేది మనిషి ఎదుగుదలకు, విద్యావికాసానికి ఉపయోగించాలి కానీ అనవసరమైన వాటితో మనకు మనం బహిర్గతం కాకూడదు అని వివరించారు. వాట్సప్ డిపిలుగా తమ ఫోటోలను అమ్మాయిలు ఎట్టి పరిస్థితుల్లో పెట్టకూడదని, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ తదితర సోషల్‌మీడియాలో వ్యక్తిగత వివరాలు వెల్లడించకూడదు. అపరిచితులతో చాటింగ్‌లు వంటి వాటివలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని సూచించారు. అనుమానస్పదంగా ఎవరైనా కనిపిస్తే కుటుంబ సభ్యులు తెలియజేయాలన్నారు. వేధింపులకు గురిచేస్తే షీటీమ్‌ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం
కొంపల్లి మున్సిపల్ చైర్మన్ శ్రీశైలంయాదవ్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ శ్రీశైలంయాదవ్

కొంపల్లి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : కొంపల్లి మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధి 6వవార్డులో రూ,16లక్షలతో ఆర్‌సిసి పైప్‌లైన్, 7వ వార్డులో 18లక్షలతో సిసిరోడ్డు, 10లక్షలతో పార్కు అభివృద్ధి, 8వ వార్డులో 12లక్షలతో ఆర్‌సిసి పైప్‌లైన్, 9వ వార్డులో 10లక్షలతో ఓపెన్‌జిమ్, 10వ వార్డులో 10లక్షలతో ఓపెన్‌జిమ్, 13వ వార్డులో 56లక్షలతో సిసిరోడ్లు, 14వ వార్డులో 15లక్షలతో సిసిరోడ్లు, 15లక్షలతో ఎస్సి కమ్యూనిటీహాల్, 17వ వార్డులో 8లక్షలతో స్టార్మ్‌వాటర్‌డ్రైన్, 18వ వార్డులో 15లక్షలతో సిసిప్యాచ్‌వర్క్ పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ రత్నావత్ గంగయ్యనాయక్, కమీషనర్ శ్రీహరి, ఏఈ ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్లు పూజారి వసంత, రజని, రాజిరెడ్డి, కృష్ణవేణి, రవియాదవ్, లక్ష్మీ, కిరణ్‌కుమార్, కో-ఆప్షన్‌సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్లకు నిధులు మంజూరు చేయాలి

జోనల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న కార్పోరేటర్ వెంకటేష్

ఫిల్మ్‌నగర్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త : జూబ్లీహిల్స్ డివిజన్‌లోని నూతన రోడ్ల విషయంపై జూబ్లీహిల్స్ డివిజన్ కార్పోరేటర్ వెల్లoడ వెంకటేష్ శుక్రవారం ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రను కలిసి నిధులు మంజూరు చేసి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఇంద్రనగర్, ఫిల్మ్ నగర్‌లోని దెబ్బతిన్న రహదారుల స్థానంలో నూతన సీసీ రోడ్లు వెయ్యాలని, వాటి గురించి వివరించి వాటిని వెంటనే ఆమోదించి, నిధులను మంజూరు చేయాలని కోరడం జరిగింది. దీనికి గాను కమీషనర్ సానుకూలంగా స్పందించి త్వరితగతిన నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమీషనర్ ప్రశాంతి పాల్గొన్నారు.

టిఎన్‌జిఓ జిల్లా ఉద్యోగ సంఘం ప్రతినిధుల ఆందోళన

గన్‌ఫౌండ్రి, సెప్టెంబర్ 15ప్రభాతవార్త:ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తున్న డాక్టర్ కల్పన కాంటే పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ నాన్‌గజిటెడ్ హైదరాబాద్ జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో రెండవ రోజు డాక్టర్ కల్పన కాంటే ఉద్యోగులపై వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా ఎస్సిసి.డిసిఒ యూనిట్లో ఉద్యోగులతో కలిసి పెద్ద ఎత్తున్న ఆందోళన చేశారు. ఈసందర్భంగా డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ మాట్లాడుతూ తెలంగాణ ఆరోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ గడాల శ్రీనివాస్‌రావు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్‌లు కల్పనా కాంటే పై విచారణ జరిపి శాఖపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆమెలో ఎలాంటి మార్పురాలేదన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.విక్రమ్ కుమార్,సభ్యులు ఉమర్‌ఖాన్.కె.శ్రీనివాస్, మొహమ్మద్ అబ్దుల్‌ముజీబ్, ఖాలీద్‌అహ్మద్, బొల్లిగద్దశంకర్, శ్రీధర్‌నాయుడు, ముఖీంఖురేషీ,గజిటెడ్ అధికారి రాణి,బి.వెంకట్‌రెడ్డి, మహమ్మద్ అబ్దుల్ ముజీబ్,సెంట్రల్ లైబ్రరీ,వైద్యశా, ఆయుష్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు,తెలంగాణ వక్స్‌బోర్డు, ఐటిఐ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నిమజ్జనం ప్రాంతాలను సందర్శించిన అధికారులు

నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ సత్యనారాయణరావు, తహసీల్దార్ సుచరిత, సిఐ రామకృష్ణ

దుండిగల్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని ఐదు వినాయక నిమజ్జన ప్రాంతాలను కమీషనర్ సత్యనారాయణరావు, తహసీల్దార్ సుచరిత, సిఐ రామకృష్ణలు సందర్శించారు. ఈసందర్భంగా మున్సిపల్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వార్డు ఆఫీసర్‌లకు పలు సూచనలు చేశారు. నిమజ్జన ప్రాంతాల వద్ద భారీకేడ్లు, లైటింగ్ సిస్టమ్, క్రేన్‌ల ఏర్పాటు వంటి విషయాల్లో ముందస్తూ జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ నర్సింహులు, ఆర్‌వో సునంద, ఇంజినీర్ ప్రవీణ్, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలను పూజించాలి
నిజాంపేట మేయర్ నీలారెడ్డి

మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న మేయర్ కొలన్ నీలారెడ్డి

నిజాంపేట, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: పర్యావరణ పరిరక్షణలో భాగంగా నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కార్పొరేషన్ తరపున మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ కార్యక్రమాన్ని మేయర్ నీలారెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా కమీషనర్ రామకృష్ణ రావుతో కలిసి ప్రతిమలను పంపిణీ చేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధి ఆయా డివిజన్లలో మున్సిపల్ సిబ్బంది ద్వారా మట్టి వినాయక ప్రతిమలు పంపిణి చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు పర్యావరణ హితమైన మట్టి ప్రతిమలను పూజించాలని సూచించారు. ఈనెల17న భారత స్వచ్ఛత లీగ్ సీజన్-2లో భాగంగా పర్యావరణ పరిరక్షణ, మొక్కలు పెంపకం, ప్లాస్టిక్ బ్యాగుల వాడకాని నిషేదిస్తూ చేపట్టనున్న ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించి అందరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలి: కె.ఎం.ప్రతాప్

కుత్బుల్లాపూర్ చౌరస్తాతో ఎస్సీ వర్గీకరణ బిల్లుపై ప్రసంగిస్తున్న మాజీ డిసిసి అధ్యక్షులు, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కె.ఎం.ప్రతాప్, శ్రీనివాస్ తదితరులు

కుత్బుల్లాపూర్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త : షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ బిల్లును వెంటనే పార్లమెంటులో ప్రవేశపెట్టి తగిన న్యాయం చేయాలని రంగారెడ్డిజిల్లా మాజీ అధ్యక్షులు, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కె.ఎం.ప్రతాప్ డిమాండ్ చేశారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ చౌరస్తాలో మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిలువేరు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన దీక్ష శిభిరానికి ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ న్యాయమైన డిమాండ్ అని వెంటనే దీనిని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి అమలుచేయాలని డిమాండ్‌చేశారు.గత 30 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న మందకృష్ణమాదిగకు అన్ని కులాలు, వర్గాలు మద్దతు ఇస్తున్నాయని అన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి మేడ్చెల్ జిల్లా ప్రధానకార్యదర్శి సిలువేరు శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్ని ఆటంకాలు వచ్చిన రిజర్వేషన్లను అమలుచేసేవరకు పోరాటం ఆగదని అన్నారు. సమావేశంలో మాదిగ స్టూడెంట్స్ జాతీయ ఉపాధ్యక్షులు తోకల చిరంజీవి మాదిగ, ఎంఆర్‌సిఎస్ కుత్బుల్లాపూర్ అధ్యక్షులు రాసమళ్ల యాదగిరి మాదిగ, కాంగ్రెస్ నాయకులు జెస్సీ పాల్, ఇస్రం రమేశ్, సలోమీ, ఎస్తేరు రాణి, మట్ట నర్సింహ్మ, జాన్, త్రినేత్ర మాదిగ, వినోద్, వినయ్, ఈశ్వర్, మనోజ్ పాల్గొన్నారు.

అంబర్‌పేట చేనంబర్ వద్ద రాకపోకలకు అనుమతించాలి
ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట ఫ్లేఓవర్ బ్రిడ్జి పనులు, ట్రాఫిక్ మళ్లింపుపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త : అంబర్‌పేట చేనంబర్ వద్ద ఒక వైపు రాకపోకలకు అనుమతించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులను ఆదేశించారు. అంబర్‌పేటలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో చేనంబర్ చౌరస్తాలో వాహనాల రాకపోకలు నిషేధించడంతో స్థానిక ప్రజలు, ఇక్కడి వ్యాపార సముదాయాల నిర్వహకులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అంబర్‌పేట చేనంబర్ చౌరస్తా వద్ద అధికారులు, ట్రాఫిక్ పోలీసులతో సమావేశమై ప్రజలకు, అక్కడి వ్యాపారస్తులకు ఇబ్బందులు కలగకుండా రోడ్డుకి ఒకవైపు రాకపోకలకు దారి కల్పించాలని ఆయన ఆదేశించారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు వాహనాల రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ అధికారులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : బాచుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెయిన్‌బోకాలనీ, ప్రణీత్‌జనీత్, దేవిహోమ్స్, మమతహాస్పిటల్ నుండి బాచుపల్లి సిగ్నల్ వరకు, సిగ్నల్ నుండి నారాయణ కళాశాల వరకు ప్రధాన రహదారి పరిసర ప్రాంతాల్లో ఉదయం 10గంల నుండి సాయంత్రం 5గంల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి : ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

కమిషనర్ సత్యనారాయణరావుకు వినతి పత్రం అందజేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

దుండిగల్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : దుండిగల్ పురపాలిక సంఘం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉద్యోగభద్రత కోసం నిర్వహించే శాంతియుత సమ్మెకు అనుమతించాలని కోరుతూ కమీషనర్ సత్యనారాయణరావుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ కంప్యూటర్ ఆపరేటర్లు, బిల్‌కలెక్టర్లు, పారిశుధ్య సిబ్బంఇ, వాటర్‌మెన్, ఎలక్ట్రిషియన్స్, వర్క్‌ఇన్‌స్పెక్టర్స్, ఆఫీసు అటెండర్లు వివిధ విభాగాలలో 264మంది గ్రామపంచాయతీలుగా యందు 5 సంవత్సరాల నుండి 30 సంవత్సరములు విధులు నిర్వహించి మున్సిపాలిటీగా ఆవిర్భవించిన తరువాత ఔట్‌సోర్సింగ్ పద్ధతిలోనే విధులు నిర్వహిస్తున్నామన్నారు. స్వరాష్ట్రంలో మా జీవితాలు బాగుపడుతాయనే ఆశతో మేము అందరం తెలంగాణ ఉద్యమంలో, సకలజనుల సమ్మెలో కీలకంగా పనిచేశామన్నారు. ఉద్యమం సమయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అనే మాట వినపడదు అని సిఎం కెసిఆర్ మాటలు గుర్తు చేశారు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే కార్మికుల శ్రమను గుర్తించి క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. 20వ తేది వరకు విధులు నిర్వర్తిస్తూ శాంతియుత సమ్మె చేస్తామని, తదువరి విధులను బహిష్కరించి నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

చికోటి ప్రవీణ్‌కుమార్‌ను బిజెపి అవమానించింది
తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ హెచ్చరిక

సమావేశంలో మాట్లాడుతున్న అమరవాది లక్ష్మీనారాయణ

సైఫాబాద్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త: ఆర్య వైశ్య సామాజిక వర్గానికి చెందిన చికోటి ప్రవీణ్‌కుమార్‌ను బిజెపి ఆహ్వానించి పార్టీలో చేర్చుకోకుండా అవమాన పరిచిందని తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ ఆరోపించింది. దీన్ని తీవ్రంగా ఖండించింది. ప్రవీణ్‌కుమార్‌ను బిజెపిలోకి చేర్చుకునేందుకు తొలుత అపాయింట్‌మెంట్ ఇచ్చిందని, దీంతో ప్రవీణ్ అన్ని ఏర్పాట్లు చేసుకుని లక్షలాది రూపాయలు ఖర్చుచేసి హోర్డింగ్‌లు నగరమంతా ఏర్పాటు చేసుకుని వేలాది మందితో ఊరేగింపు నిర్వహించి నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంకు వస్తే ఎవరూ పట్టించుకోకుండా అవమానించారని, ఇది కేవలం చికోటికి జరిగిన అవమానం కాదని రాష్ట్రంలోని ఆర్యవైశ్యులకు జరిగిన అవమానంగా భావిస్తున్నామని సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ గణేష్‌గుప్తా, కోశాధికారి కొండ్లు మల్లికార్జున్, నాయకులు చింతల రవికుమార్, మొగుళ్ళపల్లి ఉపేంద్ర, కుమార్‌స్వామి, సామ్రాజ్యలక్ష్మి, ఆగిరి వెంటకేష్, ఉప్పల చంద్రశేఖర్‌గుప్తా తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 5 శాతం నుంచి 6 శాతం వరకు ఆర్యవైశ్యుల ఓట్లు ఉన్నాయని, తమకు కూడా పొలిటికల్ వింగ్ ఉందని, అ

ప్రజా సమస్యల కోసం నిరంతరం కృషి: మంత్రి తలసాని

కాచిబౌలి బస్తీలో స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి తలసాని

బేగంపేట సెప్టెంబరు 15,ప్రభాతవార్త : సనత్‌నగర్ నియోజకవర్గం లోని రాంగోపాలోపేట డివిజన్ కాచిబౌలి బస్తీలో 60లక్షల రూపాయల నిధులతో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నిధులు మంజూరయ్యా యని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్ర వారం రాంగోపాలోపేట డివిజన్ పరిధి లోని కాచిబౌలిలో మంత్రి తలసాని వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆయన తెలియజేసారు.బస్తీలో ఏ సమస్య ఉన్నా స్థానికులు తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు.అదే విధంగా సీవరేజ్,రోడ్డు నిర్మాణ పనులను కూడా త్వరలోనే పూర్తి చేయడం జరుగుతుందని చెప్పారు.బస్తీలో అవసరమైన నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని,శిధిల దశకు చేరుకున్న వాటిని తొలగించి వాటి స్థానంలో కొత్తవి వేయించాలని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకు రాగా స్పందించిన మంత్రి వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖాధికారులను మంత్రి ఆదేశించారు. మంత్రి వెంట జోనల్ కమీషనర్ రవికిరణ్,డిసి శంకర్, మాజీ కార్పోరేటర్లు అత్తెల్లి అరుణా శ్రీనివాస్ గౌడ్,కొసికే కిరణ్మయి ఈఈ సుదర్శన్,వాటర్ వర్క్స్ సీజీఎం ప్రభు,ఎలక్ట్రికల్ డీఈ శ్రీధర్,స్ట్రీట్ లైట్ డీఈ భరత్,బస్తీ అధ్యక్షుడు జగదీష్,మహేష్, శ్రవణ్‌కుమార్,వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.

బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో చీరె దంపతుల పూజలు



బేగంపేట సెప్టెంబరు 15,ప్రభాతవార్త : రానున్న ఎన్నికల్లో సనత్‌నగర్ నియోజ కవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచేందుకు అవకాశం కల్పించేలా చూడా లంటూ బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో రాంగోపాల్‌పేట కార్పోరేటర్ చీరె సుచిత్రా, సత్యనారాయణ (శ్రీకాంత్)లు శుక్ర వారం పూజలు నిర్వహించారు. అనం తరం రాంగోపాలోపేట డివిజన్ లోని తన కార్యాలయంలో చీరె దంపతులు మాట్లాడుతూ తాము పార్టీకి ఎంతో విధేయతగా ఉన్నామని,పార్టీ పెద్దలు తాము ఇప్పటి వరకు చేసిన కార్యక్రమాలను పరిగణన లోకి తీసుకుని త్వరలో జరగనున్న ఎన్నికల్లో సనత్‌నగర్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పిస్తే తప్పకుండా విజయం సాధిస్తాననే ధీమాను వ్యక్తం చేసారు.

తెలుగుదేశంలో చేరిన యోగా గురువు బాబా పాండురంగం

బాబా పాండురంగంను పార్టీలోకి ఆహ్వానిస్తున్న సాయిబాబా

ధర్మాచౌక్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త: రాష్ట్ర వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు, యోగా గురువు, ప్రముఖ న్యూమ రాలజిస్ట్ బాబా పాండురంగం తెలుగుదేశం పార్టీలో చేరారు. శుక్రవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో టీడీపీ సికింద్రాబాద్ పార్ల మెంటు అధ్యక్షులు పి.సాయిబాబా పాండు రంగంకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సాయి బాబా మాట్లాడుతూ అభివృద్ధికి, ప్రగతికి సూచిక అయిన చంద్రబాబునాయుడు గారిని రాజకీయంగా ఎదుర్కొనలేక కుటిల ప్రయత్నాలతో అరెస్ట్ చేయించి జైల్లో పెట్టారని ఆరోపించారు. అనంతరం పాండురంగం మాట్లాడుతూ తాను పదవులు, రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా ప్రజల ప్రయోజనాలు కాపాడాలనే ఉద్దేశ్యంతో టీడీపీలో చేరుతు న్నానని, తాను నిర్వహించే యోగా, న్యూమరాలజీ శిబిరాల ద్వారా పార్టీకి సేవలు అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, బాలరాజ్గౌడ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దోజు రవీంద్రాచారి, ప్రశాంత్ యాదవ్, జోగిందర్‌సింగ్, ప్రకాష్, రవిగౌడ్, యాదగిరి పాల్గొన్నారు.

జిహెచ్ఎంసీ సర్కిల్ 29లో పనిచేసే డీఏఓ ఎప్పుడు అందుబాటులో ఉండరు

తార్నాక, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : సికింద్రాబాద్ సర్కిల్ 29లో డిఏఓగా పనిచేసే అదికారితో పాటు సంబంధిత సిబ్బంది విధులకు సక్రమంగా రావడంలేదని దీంతో ప్రజలతో పాటు కాంట్రాక్టర్లమైన తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గండి కోట ఆనంద్‌కుమార్ ఆరోపించారు. సంభందిత ఉన్నతాధికారులకు శుక్రవారం అసోసియేషన్ ఆద్వర్యంలో లిఖితపూర్వకమైన ఫిర్యాదుచేశారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సంభందిత అధికారిపై సూపరిండెంట్ ఇంజనీర్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కాంట్రాక్ట్ పనులు చేసిన తమకు సకాలంలో బిల్లులు రాకపోడంతో చాలా ఇబ్బందులకు గురౌతున్నామని, బిల్లులు అడుగుదామంటే ఆఫీసుకు వస్తే ఏదో సమయంలో కేవలం రెండు గంటలు మాత్రమే ఉంటూ వెళ్లిపోతున్నారని దీంతో తాము తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేసి బిల్లులు వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.విజయ్‌కుమార్, కోషాదికారి వీరేష్, వెంకటయ్య, కొండగట్టు శ్రీను, రాజు, వెంకటేష్, నర్సింహ్మతో పాటు పలువురు ఫిర్యాదు ఇచ్చిన వారిలో ఉన్నారు.

ఇద్దరు నేరస్తుల అరెస్ట్

చార్మినార్,సెప్టెంబరు 15 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీ మ్యూర్‌చౌక్ ప్రాంతంలో ఆటోలో ప్రయాణం చేస్తున్న ఓ యువకుడిని కత్తితో బెదిరించి నగదు,రెండు సెల్‌ఫోన్లు దోచుకెళ్లిన ఓ పాత నేరస్థుడుతో పాటు మరో యువకుడిని హుస్సేనీఆలం పోలీసులు శు క్రవారం అరెస్ట్ చేశారు.నిందితుల వద్ద నుంచి కత్తి 2 వేల రూపాయల నగదు,రెండు సెల్. ఫోన్లు,ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.దక్షిణ మండలం డిసిపి సాయి చైతన్య కేసుకు సబంధించిన వివరాలను శు క్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు.పాతబస్తీ బార్కాస్ ప్రాంతానికి చెందిన మహ్మద్ అబ్దుల్ గఫార్ ఈ నెల 14వ రాత్రి 1.30 గంటల సమయంలో ఉస్మానియా ఆసుప త్రిలో చికిత్స పొందుతున్న తమ బంధువు మహిళను చూడటానికి ఆటోలో బయలు దేరాడు.కాగా ఆటో మ్యూర్‌చౌక్‌లోని ఈసార్ పెట్రోల్ పంపు వద్దకు రాగానే ద్విచక్ర వాహనంపై వచ్చిన రక్షాపురంకు చెందిన సయ్యద్ వాజిద్ అలీ (26),తలాబ్‌కట్ట ప్రాంతానికి చెందిన మహ్మద్ ఇక్బాల్ (24)లు ఆటోలో ఉన్న మహ్మద్ అబ్దుల్ గఫార్‌ను కత్తితో బెదిరించి 4500 రూపాయల నగదుతో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.కాగా సయ్యద్ వాజిద్ అలీపై చార్మినార్,రాజేంద్రనగర్,హుస్సేనీఆలంతో పాటు 12 పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదై ఉన్నాయి.కాగా పరారీలో ఉన్న సయ్యద్ వాజిద్ అలీ,మహ్మద్ ఇక్బాల్‌ను పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు,2 వేల రూపాయల నగదు,కత్తితో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.ఈ విలేకర్ల సమావేశంలో దక్షిణ మండలం అడిషనల్ డిసిపి షేక్ జహంగీర్,చార్మినార్ ఎసిపి రు ద్రభాస్కర్,హుస్సేనీఆలం సిఐ నాగేశ్వర్‌రెడ్డి,డిఐ స్వామిలు పాల్గొన్నారు.

ఎంఐఎం ఆధ్వర్యంలో సెప్టెంబరు 17న బైక్ ర్యాలీ, బహిరంగ సభ

చార్మినార్,సెప్టెంబరు 15 ప్రభాతవార్త : జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా ఎంఐఎం ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన మాసాబ్‌ట్యాంక్‌లోని హాకీ గ్రౌండ్‌లో బహిరంగ సభ జరుగతుందని ఎంఐఎం పిఆర్ఓ మహ్మద్ తౌఫీక్ తెలిపారు.నాంపల్లిలోని దర్గా యూసిఫియన్ నుంచి వందలాది మందితో బైక్ ర్యాలీ ప్రారంభమై పలు ప్రాంతాలు మీదుగా కొనసాగిన అనంతరం మాసాబ్‌ట్యాంక్ హాకీ గ్రౌండ్‌కు చేరుకుంటుందని ఆయన తెలియజేశారు.ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు జరగనున్న బహిరంగ సభలో ఎంఐఎం అధ్యక్షులు,ఎంపి అసదుద్దీన్ ఒవైసీ,ఎంఐఎం శాసన పక్ష నాయకులు అక్బరుద్దీన్ ఒవైసీ,ఎంఐఎం శాసన సభ్యులు,ఎమ్మెల్సీ లు,కార్పొరేటర్లు పాల్గొంటున్నారని తౌఫీక్ తెలిపారు.

పాలమూరు సభను విజయవంతం చేయండి : ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్‌రావు

మెహిదీపట్నం, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త : మహబూబ్‌నగర్ పాలమూరు కొల్లాపూర్‌లో నేడు జరుగబోయే భారీ బహిరంగ సభకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ ఎం. ఎస్. ప్రభాకర్ రావు పిలుపు నిచ్చారు. శుక్రవారం కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాలకు చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించి ఛలో పాల మూరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎస్. ప్రభాకర్‌రావు మాట్లాడారు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, కాప్రా సర్కిల్-1. GHMC.బాక్స్ బిడ్డరు ప్రకటన

"GHMC కాప్రా యొక్క కాప్రా సర్కిల్-1, వార్డ్ సం.1లో NRI కాలనీలో నడకదారి, క్రీడా పరికరాల ఏర్పాటు, మరియు బహిరంగ స్థలానికి ప్రహరీగోడ నిర్మాణం" పనికి షెడ్యూల్‌లో పేర్కొన్న ఐటమ్‌లకు బాక్స్ టెండర్ నోటీస్ నం.GHMC/KC/E/1/23/2023-24 తేదీ: 14.09.2023 ద్వారా కొటేషన్‌లు కోరబడుతున్నవి. షెడ్యూల్ వివరాలకు వయచేసే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కాప్రా సర్కిల్-1,GHMC కార్యాలయాన్ని సంప్రదించండి. క్ర.సం.1) విషయం: కొటేషన్‌లు ఆహ్వానిస్తున్న ఐటమ్‌లు కలిగిన దరఖాస్తు/షెడ్యూల్ జారీకి ప్రారంభ తేదీ: 15.09.2023 @ ఉ. 11.00 గం.లు. 2) పై దరఖాస్తు/షెడ్యూల్ జారీకి ముగింపు తేదీ: 19.09.2023 @ మ.12.00గం. 3) కొటేషన్‌ల స్వీకరణ ప్రారంభ తేదీ: 15.09.2023 @ మ.3.00గం. 4) కొటేషన్‌ల స్వీకరణకు చివరి తేదీ, సమయం: 19.09.2023 @ మ.3.00గం. 19.09.2023 @ మ.3.00 గం. తర్వాత ఏ కొటేషన్‌లు స్వీకరించబడవు. సంబంధిత అధికారి చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,కాప్రా సర్కిల్-1,GHMC.
DIPR.No.6726-PP/CL/Advt/1/2023-24 తేదీ: 15.09.2023 సంత్- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కాప్రా సర్కిల్-1, GHMC.

CLASSIFIEDS

CHANGE OF NAME
★ I, DEEPA JEETENDRA AWASTHI W/o Jeet Awasthi born on 19/02/1980 residing at 15-5-773, Ashok Bazar, Afzulgunj Hyderabad, have changed my name to DEEPA RANI AWASTHI vide affidavit dated 04 July 2023 at Hyderabad
(Ro.No.26659)

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

అక్టోబర్ 15నుంచి సీతారాంబాగ్‌లో భారత భాగ్య సమృద్ధి యజ్ఞం

45రోజులపాటు నిర్వాహణ
లతామా ఫౌండేషన్ చైర్మన్ మాధవిలత

కరపత్రం ఆవిష్కరిస్తున్న చైర్మన్ మాధవిలత, యమన్‌సింగ్,ప్రమోద్‌కుమార్ తదితరులు

హైదరాబాద్, సెప్టెంబరు 15,ప్రభాతవార్త: భారతదేశ సర్వతోముఖాభివృద్ధికై, భారతీయుల శ్రేయస్సును కాంక్షిస్తూ,ప్రపంచశాంతి ,సామరస్యత కాపాడేందుకు "భారత భాగ్యసమృద్ధి యజ్ఞం" పేరుతో భాగ్యనగరం లోని సీతారాంబాగ్ రామమందిర ప్రాంగణంలో అక్టోబర్ 15నుంచి నవంబర్ 27వరకు మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు లతామా ఫౌండేషన్ చైర్మన్ మాధవిలత తెలిపారు. ఈమేరకు శుక్రవారం బంజారాహిల్స్‌లోని ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యజ్ఞానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈమహాయజ్ఞాన్ని ఆశ్వయుజ శుద్ద పాడ్యమి అనగా 15 అక్టోబర్ నుంచి కార్తిక పౌర్ణమి రోజైన 27నవంబర్ వరకు 45?రోజులపాటు??నిర్వహించనున్నట్లు తెలిపారు. భాగ్యనగరంలో అత్యంత పురాతన ఆలయాల్లో ఒకటిగా పేరుగాంచిన సీతారాంబాగ్ శ్రీరామ దేవస్థాన ప్రాంగణంలో పలు హిందూ ధార్మిక సంస్థలతో కలిసి ఈకార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా సర్వకార్యసిద్ధి సహస్ర చండీసహిత మహారుద్ర కామేశ్వరియాగం జరుగుతుందని తెలిపారు. ఈయజ్ఞంలో ప్రతి కుటుంబ శ్రేయస్సు, వారి జీవితంలోని పలు సమస్యల నివారణకోసం వైదిక దర్మంలో పేర్కొనబడిన 36 రకాల వైదిక విధులు, 12రకాల కళ్యాణాలతో పాటు పలు విధాల హోమాలను కూడా నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. దేశప్రజల శ్రేయస్సును కాంక్షిస్తూ నిర్వహించ తలపెట్టిన ఈయజ్ఞంలో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సామాజిక కార్యకర్త యమన్‌సింగ్, ప్రమోద్‌కుమార్, రాజశేఖర్, శ్యాంసుందర్‌లు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టులో కెసిఆర్‌ది కీలకపాత్ర : కొరదాల నరేష్

మూసాపేట, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త : చంద్రబాబు నాయుడు అరెస్టుకు కెసిఆర్ కుట్ర చేశారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ కొరదాల నరేష్ ఆరోపించారు. ముఖ్యంగా చంద్రబాబు నాయుడు గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో మంత్రి పదవి ఇవ్వనందుకు తీవ్ర మనోవేదనకు గురైన కెసిఆర్ బయటకు వచ్చి సొంతంగా పార్టీని పెట్టి చంద్రబాబు నాయుడుపై కక్ష తీసుకుని అవకాశం ఎప్పుడొస్తుందాని ఎదురు చేడటం ఇజం కాదా ? ఈ రోజు జగన్మోహన్‌రెడ్డి తోటి అవినాభావ సంబంధంతో ఉన్న టిఆర్ఎస్ పార్టీ నాయకుడు కెసిఆర్, కెటిఆర్ అదేవిధంగా ఎమ్మెల్యేలు, స్కిల్ డెవలప్‌మెంట్ దానికి సంబంధించిన కుంభకోణంలో ఎఫ్ఐఆర్‌లో పేరు లేకున్నా చంద్రబాబు నాయుడిని అరెస్టు చేయడం చాలా విడ్డూరమని, దీని వెనక జగన్మోహన్‌రెడ్డికి సలహాలిచ్చి చంద్రబాబు నాయుడుని అరెస్ట్ చేయి కెసిఆర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు పైశాచిక ఆనందం పొందారని డాక్టర్ నరేష్ తెలియజేశారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఈ విషయం తెలిసిన తెలవనట్టుగా దీని వెనక బిజెపి పాత్ర ఉన్నదని చంద్రబాబు నాయుడు అరెస్టు వెనక బిజెపి కుట్ర చేసిందని ఆంధ్ర ఓటర్లను తప్పుదోవ పట్టిస్తున్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే కృష్ణారావు, అరికెపూడి గాంధీ ఆంధ్ర ఓటర్ల కోసం ఈ విధమైన అబద్ధాలు ఆడుతూ దొంగే దొంగ దొంగ అన్నట్టుగా ఉన్న చందనంగా ఉన్నదని తెలియజేశారు.

దరఖాస్తుల పరిశీలను వేగవంతం చేయాలి

కుత్బుల్లాపూర్ ఎన్నికల బూత్‌లేవెల్ అధికారులతో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి నాగమణి తదితరులు

కుత్బుల్లాపూర్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త : ఎన్నికలలో దరఖాస్తుల పరిశీలను వేగవంతంచేసి త్వరితగతిన పూర్తిచేయాలని కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగమణి ఆదేశించారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి బూత్‌లేవెల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సహాయ ఎన్నికల అధికారులు అబ్దుల్ రెహమాన్‌ఖాన్, ఉదయ్‌కుమార్‌లతో కలిసి ఆమె బూత్ లెవెల్ అధికారులకు దరఖాస్తుల పరిశీలనపై కూలంకశంగా చర్చించారు.

గణేష్ నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు

సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి,సెప్టెంబరు 15 ప్రభాతవార్త : గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసన సభ్యులు టి.ప్రకాష్ గౌడ్ సంబంధిత అధికారులను ఆదేశించారు.గణేష్ ఉత్సవాలు సందర్భంగా శు క్రవారం జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయంలో రాజేంద్రనగర్ డిసిపి జగదీశ్వర్‌రెడ్డి,డిసి రవి కిరణ్‌తో పాటు పలువురు అధికారులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ గణేష్ మండపాలు వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండ విద్యుత్,మంచి నీరు,పారిశుద్ధ్యం వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు.కార్పొరేటర్లు అర్చన జయ ప్రకాష్,సంగీతతో పాటు పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

18 నుంచి 29వరకు గణపతి నవరాత్రోత్సవాలు

వివరాలు వెల్లడిస్తున్న ఆలయం చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్

చిక్కడపల్లి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త: జంటనగరాలలోని ప్రసిద్ధి గల మహిమాన్విత క్షేత్రం ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని పవిత్రమైన శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో గణపతి నవరాత్రోత్సవాలను వైభవోపేతంగా నిర్వహించబోతున్నట్లు ఆలయం పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, ఈవో లక్ష్మారెడ్డి వివరించారు. శుక్రవారం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సెప్టెంబరు 18 నుంచి సెప్టెంబరు 29వ తేదీ వరకు ఆర్టీసిక్రాస్‌రోడ్స్ శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో నవరాత్రోత్సవాలను అంగరంగ వైభవోపేతంగా నిర్వహించబోతున్నట్లు 17న అంకురార్పన ఉంటుందని, ఆ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ హాజరవుతారని అన్నారు.

కాంగ్రెస్ విజయభేరి సభను విజయవంతం చేయండి

చార్మినార్,సెప్టెంబరు 15 ప్రభాతవార్త : తుక్కుగూడలో ఈ నెల 17వ తేదీన కాంగ్రెస్ పార్టీ నిర్వహించనున్న విజయభేరి సభను విజయవంతం చేయాలని టిపిసిసి ఎలక్షన్ కోఆర్డినేషన్ కమిటి కనీ వ్నర్ పులిపాటి రాజేష్ కుమార్ (రాహుల్) కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలకు పిలుపు నిచ్చారు.పాతబస్తీ దూద్‌బౌలిలో శుక్రవారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ తుక్కుగూడలో జరగనున్న కాంగ్రెస్ పార్టీ విజయభేరి సభకు పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ,రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీ,మల్లి ఖార్జున ఖర్గేతో పాటు పలువురు ప్రలువురు ప్రముఖులు విచ్చేయనున్నారని ఆయన తెలియజేశారు.పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు తరలి వచ్చి కాంగ్రెస్ విజయభేరి సభను విజయవంతం చేయాలని రాజేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త : గుర్తు తెలియని ఓ వృద్ధుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఎస్ఐ బాను ప్రకాష్ కథనం ప్రకారం.. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ కళాశాల గేట్ ఫుట్‌ఫాత్ వద్ద గుర్తు తెలియని 65 సంవత్సరాల వయస్సు గల ఓ వృద్ధుడు అనారోగ్యంతో ఈ నెల 12వ తేదీన పడి ఉన్నాడు.సమాచారం అందుకున్న పోలీసులు గుర్తు తెలియని వృద్ధుడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు.మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధుడు మృత దేహాన్ని పోలీసులు ఉస్మానియా మార్చురీలో భద్రపరిచారు.ఈ కేసును రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బిసి సంక్షేమ హాస్టళ్లలో సీట్ల సంఖ్యను పెంచాలి

బూర వెంకటేష్‌కు బిసి విద్యార్థి సంఘం కేంద్రకమిటీ వినతి



వినతిపత్రం ఇస్తున్న విక్రంగౌడ్, మహేష్‌యాదవ్, శ్యాంకురుమ,లింగంగౌడ్ తదితరులు

హైదరాబాద్, సెప్టెంబరు 15,ప్రభాతవార్త: బిసి సంక్షేమ వసతి గృహాల్లో సీట్ల సంఖ్యను పెంచాలని అలాగే పెంచిన మెస్‌చార్జీలను ఈనెలనుంచే అమలు చేయాలని బిసి విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ బిసి సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి బూర వెంకటేశంను కోరింది. ఈమేరకు శుక్రవారం బిసి విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు తాటి కొండ విక్రంగౌడ్, రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం బూర వెంకటేష్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసింది. ఈసందర్భంగా కేంద్రకమిటీ అధ్యక్షులు విక్రంగౌడ్ మాట్లాడుతూ సంక్షేమ వసతిగృహాలకు, మహాత్మాజ్యోతిభాపూలే గురుకులాలకు సొంతభవనాలు నిర్మించాలని, వసతిగృహంలో పనిచేసే వర్కర్ల సంఖ్యను 5నుంచి 10మందికి పెంచడంతోపాటు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజ్ రియంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో యువజనసంఘం అధ్యక్షులు కనకాల శ్యాంకురుమ, రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమనేత డా.లోకేష్ యాదవ్‌కు సన్మానం

తార్నాక, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యమనేత ఎన్నికల స్ట్రాటజీ కమిటీలో స్థానం లభించిన ఒ.యూ ఉద్యమనేత డా.లోకేష్ యాదవ్‌కు ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నేతలు, విద్యార్థులు, కాంగ్రెస్ నేతలు ఘనంగా న్మానించారు. ఈ సందర్భంగా లోకేష్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థి దశనుంచి నేటి వరకు తాను కాంగ్రెస్ పార్టీని మాత్రమే నమ్ముకొని పనిచేస్తువెళ్లుతున్నానని అదిష్టానం తన సేవలను గుర్తించి ఎన్నికల స్ట్రాటజీ కమిటీలో స్థానం కల్పించినందుకు పార్టీకి రుణపడి ఉంటానన్నారు. రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, ఇంచార్జి మాణిక్ రావు ఠాక్రే, మల్లు బట్టివిక్రమార్క,టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిలకు కృతజ్ఞతలు అన్నారు. తుక్కుగూడలో జరిగే విజయభేరిని విజయవంతం చేసేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థి నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ నాయకత్వాన్ని బలపరిచే క్రమంలో లోకేష్ యాదవ్‌కు ఖమ్మం అసెంబ్లీ టికెట్ కేటాయించాలని, ఓ.యూ నుంచి మరో 4గురి విద్యార్థి నేతలకు అసెంబ్లీ టికెట్లను కేటాయించాలని కోరారు.

జాబ్ మేళాలో ఉద్యోగాలు పొందిన యువతులతో జిజివైఎఫ్ చైర్మన్,బిఆర్ఎస్ నాయకులు

జియాగూడ,సెప్టెంబరు 15 ప్రభాతవార్త : గడ్డం గంగాధర్ ఫౌండేషన్ ద్వారా నిర్వహించిన జాబ్ మేళాలో ఉద్యోగాలు పొందిన యువతులతో జిజివైఎఫ్ చైర్మన్,బిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్,ఈసందర్భంగా చుడీబజార్ హరిజన సేవక్‌మండలి అధ్యక్షులు మిద్దె కృష్ణ,ప్రధాన కార్యదర్శి ఎం.ధర్మేందర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపిని బలోపేతం చేసే దిశగా ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలి

కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త : భారతీయ జనతా పార్టీ తెలంగాణలో బలోపేతం చేసే దిశగా ప్రతీ కార్యకర్త శక్తివంచనతో కృషి చేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా సెక్రటరీగా పదోన్నతి పొందిన డాక్టర్ కిరణ్‌ని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు శుక్రవారం తన కార్యలయంలో శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భం

అక్రమ సంపాదన కాపాడుకోవడం కోసమే బిఆర్ఎస్‌లో చేరిన సుధీర్‌రెడ్డి : మధుయాష్కి

సమావేశంలో మాట్లాడుతున్న మధుయాష్కిగౌడ్

ఎల్.బి.నగర్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త: ఎమ్మెల్యే దేవీరెడ్డి సుధీర్‌రెడ్డి తన అక్రమ సంపాదనను కాపాడుకోవడం కోసమే బిఆర్ఎస్‌లో చేరారని, రానున్న ఎన్నికలలో ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని మాజీ ఎంపీ, కాంగ్రెస్ ప్రచారకమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ అన్నారు. మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్‌గౌడ్‌ను కలిసిన మధుయాష్కి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. అందుకు స్పందించిన ప్రకాష్‌గౌడ్ త్వరలోనే తన అనుచరుల తో కాంగ్రెస్లో చేరుతామని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వజీర్ ప్రకాష్‌గౌడ్‌కు కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్‌లో గెలిచి తల్లి లాంటి కాంగ్రెస్ పార్టీనీ మోసం చేసిన ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి ప్రజలకు ఏం న్యాయం చేస్తాడని ప్రశ్నించారు. మలిదశ ఉద్యమంలో శ్రీకాంత్‌చారి ఆత్మ బలిదానంతోనే ఎల్బీనగర్ నుండి తెలంగాణ ఉద్యమం మొ దలైందని కెసిఆర్ ఆగడాలను అంతం చేసేందుకు మరోసారి ఎల్బీనగర్ వేదిక వుతుందన్నారు. ఉద్యమంలో చొరబడిన కేసీఆర్ కుటుంబానికే లబ్ధి చేకూరిందని తెలంగాణ ప్రజలకు అన్యాయం జరిగిందన్నారు. ఎమ్మెల్యే సుదీర్‌రెడ్డి తన అక్రమంగా సంపాదించుకున్న ఆస్తులను కాపాడుకోవడంకోసమే బిఆర్ఎస్‌లో చేరాడని, ఆయనఅరాచకాలు ఇకపై సాగనివ్వమన్నారు. త్వరలో ఎల్బీనగర్‌నుండి బిఆర్ ఎస్ మాజీ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లోకి పెద్దఎత్తున వలస వస్తున్నారన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని తిరిగి తెలంగాణలో గెలిపించుకొని అధికారాన్ని హస్తగతం చేసుకుం టామన్నారు.ఈ నెల 17 న తుక్కుగుడలో జరిగే విజయభేరి సభకు సోనియా గాంధీ, ప్రియాంకగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లిఖార్జునఖర్గే హాజరవుతున్నారని సందర్భంగా సభకు లక్షలాదిగా తరలి రావాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పార్టీ సభ్యత్వానికి వజీర్ రాజీనామా... కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్‌గౌడ్ బిఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన ట్లు ప్రకటించారు. తనకు పార్టీలో సరైన గుర్తింపు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకాష్‌గౌడ్‌తో పాటు జోగు రాములు, సుబ్రమణ్యం, మల్లేష్ తదితరులు త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరుతామని ప్రకటించారు.

నిరు పేద కుటుంబాలకు చేయూత ఇస్తున్న బిఎల్ఆర్ ట్రస్ట్ : బండారి లక్ష్మారెడ్డి

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న దృశ్యం

కుషాయిగూడ, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : మీర్‌పేట్ హెచ్‌డికాలనీడివిజన్ రాజీవ్‌నగర్‌లో నివాసముంటున్న పాలమాకుల సుదర్శన్ అనారోగ్యంతో బాధ పడుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఉప్పల్ నియోజకవర్గ బిఆర్ ఎస్ ఎమ్మెల్యేఅభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ఆదేశాలమేరకు బిఎల్ఆర్‌ట్రస్ట్ ద్వారా గుమ్మడి జంపాల్‌రెడ్డి ఆర్థిక సహాయం అందజేసారు. అదేవిధంగా చర్లపల్లి డివిజన్ చిన్న చర్లపల్లికి చెందిన విజయ్ గత బుధవారం యాక్సిడెంట్ అయ్యి కుడికాలు విరగడంతో బండారి లక్ష్మారెడ్డి ఆదేశాలతో చర్లపల్లి డివిజన్ బిఆర్ ఎస్ నాయకుడు నరసింహముదిరాజ్ 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న బండారి లక్ష్మారెడ్డి మద్దతు నివ్వాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో శంకర్‌యాదవ్, బుచ్చిరెడ్డి, దూసరి నవీన్ గౌడ్, భూపతి, అశోక్, పంగ యాకూబ్, కందుకూరి కృష్ణమూర్తి, బొడ్డు శీను, యాదగిరి, గొల్లూరి మనీష్, పాండు, భూపాల్, గోవిందరాజు గౌడ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లైన్లకు రూ.16 కోట్లు మంజూరు : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త: నియోజకవర్గంలోని పలు ప్రాంతా లలో మంచినీటి సమస్య పరిష్కరించేందుకు రూ.16కోట్ల నిధులు మంజూరై నట్లు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. హెచ్ఏండబ్ల్యూఎస్, ఎస్‌బి మేనేజింగ్ డైరెక్టర్ ఏం.ధానకిశోర్‌ని శుక్రవారం ఎమ్మెల్యే కలిసి స్థానిక సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 62 కిలోమీటర్లమేర నూతన వాటర్ పైప్ లైన్స్ మంజూరు చేయడం జరిగిం దని, మరో 19కిలోమీటర్లమేర అదనంగా వాటర్‌లైన్స్ మంజూరుచేస్తే శివారు ప్రాంతాల్లో మంచినీటి సమస్య పరిష్కారవుతుందన్నారు. నూతన యూజీడి లైన్స్ కూడా మంజూరు చేయాలని కోరారు. అందుకు స్పందించిన దానకిషోర్ మాట్లాడుతూ నూతన యూజీడిలైన్స్‌కోసం దాదాపు రూ.16కోట్లు మంజూరు చేశామన్నారు. పనులు త్వరలో ప్రారంభం అవుతాయన్నారు. అధికారులను పిలిపించి పది రోజుల్లో టెండర్ వేయాలని, ఇరవై రోజుల్లో పనులు ప్రారం భం చేయాలని ఆదేశించారు.

చంద్రబాబు అక్రమ అరెస్టును ఎమ్మెల్యే ఖండించకపోవడం శోచనీయం : రంగారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి తదితరులు

వనస్థలిపురం, సెప్టెంబరు 15 ప్రభాతవార్త : గత అసెంబ్లీ ఎన్నికలలో టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు సహకారంతో ఎమ్మెల్యేగా గెలిచానని ఎన్‌టిఆర్ విగ్రహం సాక్షిగా చెప్పిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చంద్రబాబు అరెస్టును ఖండించకపోవడం శోచనీయమని రంగారెడ్డి జిల్లా బిజెపి అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి విమర్శించారు. వనస్థలిపురం ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరం లో ఐటిని అభివృద్ధి చేసిన చంద్రబాబును అక్రమ అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఆంధ్రలో జగన్, తెలంగాణలో కెసిఆర్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతన్నారని ఆరోపించారు. ఇటీవల తనకు టికెట్ రావడం చంద్రబాబు కారణమని చెప్పిన సుధీర్‌రెడ్డి అతని అరెస్టును ఎందుకు ఖండిం చడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, కొత్త రవీందర్‌రెడ్డి, నూతి శ్రీనివాసరావు, నీళ్ల అంజన్‌కుమార్‌గౌడ్, తడకమళ్ల విజయ్‌కుమార్, రవిశంకర్, విజయశ్రీచౌదరి, కృష్ణవేణి కృష్ణంరాజు, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా యుద్ధనౌక గద్దర్ ఆశయ సాధనకు కృషి : దోమల మల్లేష్ మాదిగ

గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మల్లేష్ మాదిగ తదితరులు

మలక్‌పేట, సెప్టెంబరు 15 ప్రభాతవార్త : ప్రజా యుద్ధనౌక గద్దర్ ఆశయ సా ధనకు కృషిచేస్తామని మాదిగ దండోర వ్యవస్థాపక అధ్యక్షుడు దోమల మల్లేష్ మాదిగర పేర్కొన్నారు. మూసారాంబాగ్‌లో మల్లేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్య క్రమంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాలులర్పించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి రాష్ట్రం సాధించడానికి గద్దర్ చేసిన సేవలు ఎనలేనివని, మేడ్చల్ జిల్లాకు, తెలుగు యూనివర్సిటీకి గద్దర్ పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో బొజ్జ శ్రీధర్, మీనాశ్రీకాంత్, కుమారస్వామి, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి బైక్ ర్యాలీకి ఘన స్వాగతం



బిజెపి అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ర్యాలీకి స్వాగతం పలుకుతున్న ఎన్వీఎస్ఎస్

ఉప్పల్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త : తెలంగాణ విమోచన దినోత్సవం సంద ర్భంగా అమృతమహోత్సవాల్లో భాగంగా పేరెడ్‌గ్రౌండ్స్ నుంచి నిర్వహించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి బైక్ ర్యాలీకి హబ్సిగూడలో పలువురు నేతలు ఘనంగా స్వాగతం పలికారు. అమరుల చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని డిమాండ్‌తో పరకాలలోని అమరదామం వరకు చేపట్టిన ఈ ర్యాలీకి హబ్సిగూడలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్లు కక్కిరేణి చేతన, శ్రీవాణి తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. అనంత రం వారు మాట్లాడుతూ అమరుల చరిత్రను ప్రతి ఒక్కరికి తెలిసే విధంగా బిజెపి నాయకత్వం కృషి చేస్తుందని, సిఎం కెసిఆర్ నియంతృత్వ పాలనకు చరమగీతం పాడాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి నేతలు సంజయ్‌పటేల్, సోమశేఖర్‌గౌడ్, చెల్లోజు ఎల్లాచారి, రవీందర్‌రెడ్డి, సుమన్‌రావు, వెంకట్‌రెడ్డి, వెంకన్నగౌడ్, గడ్డం సాయికిరణ్, పడితియా నాయక్, పూజారి సోమయ్య, వెంకటయ్య, సురేష్, భాస్కర్, శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబునాయుడు అరెస్టు అప్రజాస్వామికం : ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు..

నేరెడ్‌మెట్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: మాజీ సిఎం, టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడును అరెస్టు చేయడం సరైంది కాదని మల్కాజిగిరి ఎమ్మె ల్యే మైనంపల్లి హన్మంత్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి గా రాష్ట్రాభివృద్ధికి ఎంతో కృషి చేసిన ఆయన, అపార అనుభవం ఉన్నవాడు. ఆయనపై కేసులుపెట్టి అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. ఇది పూర్తిగా కక్ష్య సాధింపు చర్యగా భావిస్తున్నట్లు తెలిపారు. నిత్యం ఎంతో మంది ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా మంచి లక్షణాలు ఉన్న చంద్రబాబునాయుడు అరెస్టు చేయడం సబబు కాదన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ పార్టీదే విజయం : మల్‌రెడ్డి రంగారెడ్డి

విజయభేరి సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

తుర్కయంజాల్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : 17న తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ విజయభేరి సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. విజయభేరి సభకు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ఖర్గే హాజరవుతున్నారని సభకు 10 లక్షల మంది జనాలు తరలివస్తారని తెలిపారు. విజయభేరి సభతో బిఆర్ఎస్ నేతల కు వణుకుపుట్టడం ఖాయమన్నారు. రాయపోల్‌కు చెందిన పలువురు శాలి వాహన కులస్తులు రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భం గా రంగారెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా రాష్ట్రంలో, ఇబ్రహీం పట్నంలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు తరిమికొట్టడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన డిక్లరేషన్ల ను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ భూపతిగళ్ల మహిపాల్, టి.పీసీసీ కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి, మంఖాల దాసు, నాయకులు మేతరి దర్శన్, కొశికె ఐలయ్య, కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, వంగేటి గోపాల్‌రెడ్డి, దేశనాయక్ పాల్గొన్నారు.

ఖైరతాబాద్ గణనాథ రూపశిల్పి రాజేందర్ నేతృత్వంలో వినాయక విగ్రహ రూపకల్పన

కమలానగర్‌లో 31 అడుగుల షోడష భుజ మట్టి గణపతి

ఎల్.బి.నగర్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త: వినాయకచవితి సందర్భంగా 30 అడుగుల షోడశబుజా మట్టి గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మణికంఠ అయ్యప్ప భక్త సమాజం కన్వీనర్ తులసి శ్రీనివాస్ తెలిపారు. గడ్డి అన్నా రం డివిజన్ కమలనగర్‌లో మణికంఠ అయ్యప్ప భక్త సమాజం ఆధ్వర్యంలో గత 20సంవత్సరాలుగా భారీ గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నడం నగరం లోని ప్రజలను ఎంతగానో ఆకట్టుకోవ డంతో భారీ విగ్రహాన్ని చూసేందుకు వేలాదిమంది భక్తులు తరలివస్తున్నారు. ఖైరతాబాద్ గణేష్ తర్వాత అంతటి ప్రాముఖ్యాన్ని పొందిన కమలానగర్ గణపయ్య మండపంవద్ద ఈ నెల 18వ తేదీన వినాయక చవితి పూజలు నిర్వహిస్తున్నట్లు తులసి శ్రీనివాస్, ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యం వెల్లడించారు. 18వ తేదీన చవితి తిథి ఉండడంతో సోమవారం ఉదయమే మొదటి పూజ చేయనున్నట్లు తెలిపారు. ఈ సంవ త్సరం 31అడుగుల మట్టి విగ్రహాన్ని షోడశబుజ గణపతి ఆకారంలో ప్రతిష్టి స్తున్నట్లు పేర్కొన్నారు. ఖైరతాబాద్‌విగ్రహ రూపశిల్పి రాజేందర్ కమలా నగర్ విగ్రహాన్ని తయారు చేస్తున్నట్లు తెలిపారు. విగ్రహ తయారీ తుదిదశకు చేరుకున్నట్లు విగ్రహ శిల్పి రాజేందర్ వివరించారు.

హెలెన్ కెల్లర్ విగ్రహాన్ని ఆవిష్కరించాలి : ప్రసాద్

వినతి పత్రం సమర్పిస్తున్న వల్లభనేని ప్రసాద్ తదితరులు

మలక్‌పేట, సెప్టెంబరు 15 ప్రభాతవార్త : సెప్టెంబర్ 26వ తేదీన ప్రపంచ మూగ, చెవిటి దినోత్సవం మలక్‌పేట జాతీయ వికలాంగుల పార్కుల ప్రాంగ ణంలో హెలెన్ కెల్లర్ విగ్రహాన్ని ఆవిష్కరించాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ నేషనల్ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ శుక్రవారం మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమ భవనంలో వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 26న విగ్రహావిష్క రణ, జయంతి ఉత్సవాలు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని కోరారు. లేని యెడల రాష్ట్ర వాప్తంగా ముందురోజునుండే రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహి స్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిఎస్‌డి నేషనల్ కన్వీనర్ వెంకటేష్ గౌడ్,భారతి తదితరులు పాల్గొన్నారు. **విగ్రహాన్ని ఆవిష్కరిస్తాం...** సెప్టెంబర్ 26న హెలెన్ కెల్లర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.శైలజ పేర్కొన్నారు.

హిందువుల పండుగల పట్ల కెసిఆర్ వివక్ష

జోనల్ కార్యాలయం ఛాంబర్ ముందు వంట చేసి నిరసన

జోనల్ కార్యాలయం ఛాంబర్ వద్ద వంట చేస్తున్న సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు

ఎల్.బి.నగర్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త: హిందువులపండుగలు వస్తే సిఎం కేసీఆర్ వివక్షత చూపిస్తున్నారని, మరో రెండు రోజులలో వినాయక చవితి వస్తున్న సందర్భంలో ప్రభుత్వ అధికారులు ఏమాత్రం స్పందించడం లేదని ఎటువంటి సహాయక చర్యలు తీసుకోకపోవడంలేదని బీజేపీ పార్టీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ బీజేపీ కార్పొరేటర్లతో కలిసి జోనల్ కమిషనర్ పంకజ కార్యాలయంలో శుక్రవారం వంటావార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా గత వారం రోజులుగా ఎల్బినగర్ జోన్‌లోని వినాయక మండపాలను సంద ర్శించి రోడ్లు, పారిశుద్ధ్యం, చెట్లు నరికివేతకు సంబంధించి అవసరమైన వస తులను సమకూర్చాలని జడ్సికి సమీక్ష సమావేశం ఏర్పాటు చేయాలని చెప్పిన పట్టించుకోకపోవడంతో వంటావార్పు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రంజాన్, క్రిష్ట్మస్ పండుగలకు వారంరోజుల ముందు నుండే హడావిడి చేస్తార ని, హిందువుల పట్ల ఎందుకు వివక్ష చూపిస్తున్నారని ప్రశ్నించారు. ఈ కార్య క్రమంలో వంగ మధుసూదన్‌రెడ్డి, రంగ నరసింహగుప్తా, పవన్‌కుమార్, చిం తల అరుణసురేందర్‌యాదవ్, కొప్పుల నరసింహారెడ్డి, కల్లెం నవజీవన్‌రెడ్డి, లచ్చిరెడ్డి, ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, నాయకులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, దాసరి జయప్రకాష్ , ఏనుగు శ్రీధర్‌రెడ్డి, రామకృష్ణ, రుద్రాల శంకర్, కృష్ణప్రకాష్, రాజేశ్వరి, ప్రశాంతి పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయభేరి సభను విజయవంతం చేయాలి : మేయర్ చిగిరింత పారిజాత

సమావేశంలో మాట్లాడుతున్న చిగిరింత పారిజాత

సరూర్‌నగర్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: తుక్కుగూడలో ఈ నెల 17వ తేదీ ఆదివారం జరిగే కాంగ్రెస్ పార్టీ విజయభేరి సభను విజయవంతం చేయాలని టిపిసిసిప్రధానకార్యదర్శి,బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షను సాకారం చేసిన సోనియాగాంధీ మహేశ్వరం నియోజకవర్గానికి రావడం సంతోషకరమనీ, ఈ సభతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపినట్లవుతుందన్నారు.ఏది ఏమైనా కాంగ్రెస్ విజయ భేరి సభలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ కార్య క్రమంలో నాయకులు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, బండారి మనోహర్, నేనావత్ బాలునాయక్, రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, అమృతా నాయుడు, తూళ్ళ సునీతగౌడ్, గొరిగె అయిలమ్మ తదితరులు పాల్గొన్నారు.

శివసాయినగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వంగూరి మల్లేష్ యాదవ్

తుర్కయంజాల్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : తుర్కయంజాల్ మున్సిపాలిటీ శివసాయినగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవమైంది. కాలనీ అధ్యక్షుడిగా వంగూరి మల్లేష్‌యాదవ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు, అధికారులు, ప్రజాప్రతినిధుల సహాయ సహకారులతో కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

టికెఆర్ కాలేజీలో ఘనంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలు

సరూర్‌నగర్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: మీర్‌పేట్ మేడిబౌలిలోని టికెఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం విశ్వేశ్వరయ్య జయంతిని ఘనంగా నిర్వ హించారు.ఈ సందర్భంగా టికెఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ తీగల కృష్ణా రెడ్డి మోక్షగుండం విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూసీ వరదల నుండి నగరాన్ని, ప్రజలను కాపాడానికి గండిపేట్, హిమాయత్‌సాగర్‌లను నిర్మించిన విశ్వేశ్వరయ్య చిర స్మరణీయులన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ఇంజనీరింగ్ లో రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్‌సిఐ, డిఆర్‌డిఓ సైంటిస్టు ఎస్.కరుణానిధి, మాజీ ప్రిన్సిపాల్ రామస్వామిలను సన్మానించారు.

ఆస్పత్రి శానిటేషన్ సిబ్బంది సమస్యలు పరిష్కారం

వనస్థలిపురం, సెప్టెంబరు 15 ప్రభాతవార్త : 3 రోజులుగా సమ్మె చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆస్పత్రి శానిటేషన్ ఉద్యోగులకు శుక్రవారం మెడ కల్ అండ్ హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకం బిక్షపతి, అసోసియేట్ అధ్యక్షు లు డాక్టర్ శాంతి కుమార్, జిల్లా అధ్యక్షులు మావరపు నర్సింగ్, దిలీప్, ఇతర కార్యవర్గ సబ్యుల సమక్షంలో శానిటేషన్ కాంట్రాక్టర్‌ను పిలిపిం చి వారి సమస్యల పరిష్కార దిశగా చర్చలు జరిపి సఫలీకృతం చేసి వారికి ప్రబుత్వ నిబంధనల ప్రకారం రావాల్సిన రూ.12093ల వేతనంతోపాటు, ఈఎస్ఐ, పిఎఫ్ విధిగా పే చేసేలాగా డిసిహెచ్ఎస్ సూపరింటెండెంట్, ఆసుపత్రి సూప రింటెండెంట్ సమక్షంలో కాంట్రాక్టర్‌చే శానిటేషన్ సిబ్బందికి హామీ ఇప్పించా రు. చర్చలు సఫలమవడంతో పారిశుద్ధ్య సిబ్బందిచే యూని యన్ సభ్యులు దీక్ష విరమింపజేసారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిస్టు, న్యూ డెమోక్రసీ, ఐఎఫ్‌టియు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా చేసుకోవాలి : బిఎల్ఆర్

సమావేశంలో పాల్గొన్న బండారి లక్ష్మారెడ్డి, ఎసిపి నరేష్‌రెడ్డి, సిఐ గోవిందరెడ్డి

ఉప్పల్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త : వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతం గా చేసుకోవాలని బిఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి సూచించారు. ఈ మే రకు శుక్రవారం ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుల మహేందర్, అధ్యక్షుడు కుడుముల ప్రదీప్‌రెడ్డి ఆధ్వర్యంలో రామస్వామి పంక్షన్‌హాల్‌లో గణేష్ మండప నిర్వహకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బిఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, ఎసిపి పి.నరేష్‌రెడ్డి, సిఐ ఆర్.గోవిందరెడ్డి, డిఎస్‌పి వంశీమోహన్‌రెడ్డి, సినీ నటుడు రఘుబాబు, ఎస్ఐ శంకర్, ఎఇ నిఖిల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా మండప నిర్వాహ కులు తగు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద గస్తీ ఉండా లని, పోలీసులకు సహకరించాలని సూచించారు.మండప నిర్వహకులు విధిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, బొట్టు వెంకట్, ఖాజామైనుద్దీన్, గణేష్ ఉత్సవ సమితి నేతలు టంటం వీరేష్, బోరంపేట రామరాజు, ఈరెల్లి రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

కెఎంఆర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరికలు

సరూర్‌నగర్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెల గూడ దీన్‌దయాళ్‌నగర్‌కు చెందిన పలువురు మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొత్త మనో హర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతున్నదన్నారు. ఈ కార్యరక్రమంలో బిచ్యా నాయక్, మల్లేష్, సందీప్, సైదులు, శ్రీను, గోపి, శేఖర్, భూషణ్, శైలేష్, సుజాత, ఇందిర, శాంతి, కృష్ణవేణి, దేవి తదితరులు పాల్గొన్నారు.

హైటెన్షన్ వైర్ల సమస్య పరిష్కారం కోసం కృషి : డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

తార్నాక, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : తార్నాక స్ట్రీట్ నెం.10,11లో ప్రమాద కరంగా ఉన్న హైటెన్షన్ వైర్ల సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇండ్లపై నుంచి వెళు తున్న 33కెవి హైటెన్షన్ వైర్ల సమస్యను ఇటీవల శ్రీలత శోభన్‌రెడ్డి, బీఆర్ ఎస్ కార్మిక విభాగం అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో వారు సంబంధిత అధికారులతో కలిసి సమస్యను స్వయంగా తెలుసుకున్నా రు. సమస్యను త్వరగా పూర్తి చేసేలా చూస్తామని అధికారులు హామీనిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ 33కెవీ విద్యుత్ తీగల షిఫ్టింగ్ పెద్దది కావడంతో మంత్రి జగదీశ్వర్‌రెడ్డితో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు పాల్గొన్నారు.

వైశ్య గర్జన సభను విజయవంతం చేయాలి

**వనస్థలిపురం, సెప్టెంబర్ 15 ప్ర